మరోసారి జగనన్ననే సీఎం చేసుకుందాం



మాట్లాడుతున్న పరిశీలకుడు గురుమోహన్

ఆత్మకూరు: రాష్ట్రంలో నాలుగేళ్ల పరిపాలనలో కరోనా ప్రభావంతో ఆర్థికంగా రాష్ట్రం దెబ్బ తిన్నా ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు ఆగిపోకుండా అందజేశారని నియోజకవర్గ పార్టీ పరిశీలకులు సంగసాని గురుమోహన్ అన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా నవరత్నాల పథకాలు అందించిన జగనన్ననే సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆత్మకూరు పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం ఆత్మకూరు అర్బన్, రూరల్ గృహ సారథులు, పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గురుమోహన్ మాట్లాడుతూ కోట్లాది రూపాయల నిధులను సంక్షేమ పథకాలకు కేటాయించి వలంటీర్ల ద్వారా లబ్ధిదారుల ఇళ్లకే సంక్షేమాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నవంబరు 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వై ఏపీ నీడ్ జగన్ కార్యక్రమాన్ని ఇంటింటికి వెళ్లి వివరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, జెడ్పీటీసీ ప్రసన్నలక్ష్మి, ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, బట్టేపాడు సొసైటీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కొండా వెంకటేశ్వర్లు, అన్ని వార్డుల కౌన్సిలర్లు, పట్టణ, రూరల్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

జలదంకి: మండలంలోని జువ్విచెట్టుపాళెంలో గతేడాది పూడ్చిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులు శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. కలిగిరి సీఐ ఎండీ ఫిరోజ్ సమాచారం మేరకు.. తొమ్మిదో మైలుకు చెందిన గంగపట్ల మాలకొండయ్య కుమార్తె రాణి (28)కి జువ్విచెట్టుపాళెంకు చెందిన పరుసు మహేష్‌తో పెళ్లి జరిగింది. పరుసు రాణి గతేడాది సెప్టెంబరులో ఉరేసుకుని మృతి చెందింది. జలదంకి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అయితే ఇటీవల గంగపట్ల మాలకొండయ్య తన కుమార్తె రాణిని మహేష్ కుటుంబ సభ్యులే చంపి ఉరేశారని కలెక్టరేట్‌లో స్పందన అర్జీ ఇచ్చాడు. దీంతో కలిగిరి సీఐ ఫిరోజ్, జలదంకి తహసీల్దార్ పద్మావతి సమక్షంలో సమాధి నుంచి మృతదేహాన్ని వెలికి తీశారు. నెల్లూరుకు చెందిన ఫోరెన్సిక్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు పోస్టుమార్టం నిర్వహించారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

• మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

జలదంకి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అవినీతి రహిత సంక్షేమ పాలన సాగుతుందని, పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వేములపాడులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలున్నాయా అని ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు వివరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను ప్రజలకు అందించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాల రూపంలో కోట్లాది రూపాయలను లబ్ధిదారులకు అవినీతి లేకుండా అందించామని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా సంఘ మహిళల రుణాలను సీఎం జగన్ అందించారని గుర్తు చేశారు. కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే ఆదరించాలని చెప్పే దమ్మున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. టీడీపీ కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ మేదరమెట్ల శివలీల, నాయకులు వంటేరు రామచంద్రారెడ్డి, రావి ప్రసాద్‌నాయుడు, గొట్టిపాటి ప్రసాద్, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, సురె వెంకటశేషారెడ్డి, తమ్మినేని సతీష్‌నాయుడు, ఎంపీడీఓ శ్రీధర్‌బాబు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'నా భూమి.. నా దేశం' ప్రతి ఒక్కరి భావన కావాలి

• ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మేరీ మాటీ మేరా దేశ్ ర్యాలీలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: దేశ స్వాతంత్ర్యదినోత్సవం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుల గౌరవార్థం 'మేరీ మాటీ మేరా దేశ్' (నా భూమి నా దేశం) అనే దేశ భక్తి భావనను ప్రతి ఒక్కరిలో ఉండాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆర్‌సీపాళెంలో శనివారం నా భూమి నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ భక్తిని పెంపొందించేందుకే నా భూమి నా దేశం కార్యక్రమన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్నాయన్నారు. మహాత్మా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో మట్టి సేకరణ చేసి, మొక్కలు నాటారు. సైనికులుగా సేవలు అందించిన ముగ్గురిని ఎమ్మెల్యే సత్కారించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం



ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సోమశిల: రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించిన సంక్షేమ సారథి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శనివారం అనంతసాగరంలో 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' అనే కార్యక్రమంలో భాగంగా మండల నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లక్షల రూపాయలు సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాల కింద ప్రతి ఒక్క కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేశారన్నారు. అందరికి చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నవంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, జిల్లా అధికార ప్రతినిధి బిజివేముల ఓబుల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ కమతం శోభ, బొమ్మవరం సర్పంచ్ లక్ష్మిదేవి, జేసీఎస్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి, శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు, సొసైటీ అధ్యక్షుడు కేతా రామకృష్ణారెడ్డి అనంతసాగరం చెరువు ప్రెసిడెంట్ మాబాషా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.